క్లుప్తంగా

అనారోగ్యంతో విద్యార్థిని మృతి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పి.ఆమిటి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న నిమ్మల అవంతి(13) అనారోగ్యంతో పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కె.శివడ గ్రామానికి చెందిన బాబూరావు, మల్లేశ్వరిల కుమార్తె అవంతికి ఆశ్రమ పాఠశాలలో చదువుతోంది. సెప్టెంబర్ 28న అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు భద్రగిరి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి వైద్యులు రిఫర్ చేశారు. వైద్య పరీక్షల అనంతరం రక్తం తక్కువగా ఉందని, ప్లేట్‌లెట్లు 40 వేలు ఉండటంతో వైద్యులు వెంటనే చికిత్స ప్రారంభించారు. సెప్టెంబర్ 30న ఒక యూనిట్ రక్తం ఎక్కించారు. ఇంతలో మరలా జ్వరం రావటం, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది పడుతుండగా చికిత్స అందిస్తున్న తరుణంలో మంగళవారం రాత్రి మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న ఏటీడబ్ల్యూఓ బి.సురేష్‌కుమార్, ఆశ్రమ పాఠశాల సిబ్బంది బుధవారం కె.శివడకు వెళ్లి విద్యార్థిని కుటుంబ సభ్యులను పరామర్శించారు. దహన సంస్కారాల నిమిత్తం రూ.10వేలు అందించారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని బాలేసు పంచాయతీ బయ్యాడ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆ గ్రామస్తులు బుధవారం కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి వినతిపత్రం అందజేశారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలందక ప్రాణాపాయ స్థితి అనుభవిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ గ్రామానికి రోడ్డు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రోడ్డు నిర్మాణానికి తగిన చొరవ చూపుతానని హామీ ఇచ్చారు.

గిరిజనుల శ్రమదానం



పైప్‌లైన్ కప్పుతున్న గ్రామస్తులు

సీతంపేట: ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురుచూడకుండా చంద్రమ్మగూడ గిరిజనులు చేయిచేయి కలిపి బుధవారం శ్రమదానం చేశారు. కాగుమానుగూడలో ఉన్న గ్రావిటేషన్ ద్వారా చంద్రమ్మగూడ గ్రామానికి పైప్‌లైన్ ద్వారా నీటిని అందజేస్తున్నారు. అయితే పైప్‌లైన్ భూమి లోపలనుంచి కాకుండా బయట నుంచి వేశారు. దీంతో పైప్‌లైన్ పాడవుతుందని భావించిన గ్రామస్తులు శ్రమదానంతో భూమి లోపలికి వేశారు. కార్యక్రమంలో ఎస్. ఆనప, రాధా, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన జేఏసీ నాయకులు

సీతంపేట: ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్సై వై. అమ్మన్నాయుడును గిరిజన జేఏసీ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతిభద్రతలకు సంబంధించి ఆయనతో చర్చించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎం.రవి, ఎస్.కాంతారావు, రామ్మోహనరావు, వినోద్, మోహన్‌పాల్, ఉమామహేష్, రమేష్, నరేష్, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

పొలాల అమావాస్య పూజలు

గరుగుబిల్లి: మండలంలోని గరుగుబిల్లి, రావుపల్లి, గొట్టివలస, రావివలస, కొంకడివరం తదితర గ్రామాల శ్రావణమాసంలో వచ్చే అమావాస్య రోజున పొలాల అమావాస్య పూజలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగా బుధవారం ఆయా గ్రామాలలో పొలాల్లోని వరి దుబ్బును తీసుకొచ్చి పూజా మందిరంలో పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పిండివంటలతో పాటు పలు కూరగాయలతో తయారుచేసిన కలగూరను నైవేద్యంగా పెట్టి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

143 మందికి కంటి పరీక్షలు

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి జంక్షన్‌లోని తిరుమల సాయి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సహాయ స్ఫూర్తి ఫౌండేషన్, శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వారి సహకారంతో వైద్యాధికారి డాక్టర్ అలేఖ్య 143 మంది కంటి రోగులకు తనిఖీలను నిర్వహించారు. ఇందులో 81 మందికి కేటరాక్ట్ దోషం ఉండటంతో శస్త్రచికిత్స కోసం విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో వెంకటరమణ, తదితరులున్నారు.

విరాళం అందజేత

గుమ్మలక్ష్మీపురం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం గుమ్మలక్ష్మీపురం గ్రామంలోని సరస్వతి విద్యానికేతన్ స్కూల్ కరస్పాండెంట్ విమల రూ.10వేలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని బుధవారం కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి అందజేశారు. సీఎం సహాయ నిధికి అందించాలని కోరారు.

అక్రమంగా పశువుల రవాణా

కొమరాడ: ఒడిశా నుంచి అక్రమంగా పశువులు రవాణా చేస్తున్నా ఆరు బొలెరో వాహనలను కొమరాడ వద్ద బుధవారం సీజ్ చేసినట్లు ఎస్ఐ కె.నీలకంఠం తెలిపారు. ఒడిశా నుంచి పార్వతీపురం వైపు అక్రమంగా తరలిస్తున్న 38 పశువులను అదుపులోకి తీసుకుని వాహన డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.



సీతంపేట: ఐటీడీఏ ఆవరణలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న డిప్యూటీ ఈఈ నారాయుడు, తదితరులు



పాలకొండ: గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులు



గరుగుబిల్లి: రావివలసలో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ బాపూజీనాయుడు, తదితరులు



జియ్యమ్మవలస: బీజేపురంలో మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేస్తున్న యువత



గుమ్మలక్ష్మీపురం: కురుపాం తహసీల్దార్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ రమణమ్మ, సిబ్బంది



కొమరాడ: విక్రంపురం సచివాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



పాలకొండ రూరల్: లుంబూరులో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్, అధికారులు



భామిని: బాలేరులో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు



గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురంలోని తన నివాసంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

మహాత్ముని జీవితమే ఓ సందేశం ..

జాతిపిత మహాత్మా గాంధీ జీవితం ప్రతి ఒక్కరికీ ఓ సందేశమని డిప్యూటీ డీఈఓ పి. నారాయుడు అన్నారు. ఐటీడీఏలో గాంధీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే వాడవాడలా గాంధీ జయంతిని వైభవంగా నిర్వహించారు. ప్రతి ఒక్కరూ గాంధీజీ మార్గదర్శకాలను అనుసరించాలని వక్తలు సూచించారు. సత్యం, అహింస అనే ఆయుధాలతో బ్రిటీష్ వారిని ఎదురించిన గాంధీజీని ఆదర్శంగా తీసుకోవాలని అభిప్రాయపడ్డారు.

– పాలకొండ/కురుపాం నెట్‌వర్క్



వీరఘట్టం : నడుకూరులో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సాకేటి రాంబాబు మాస్టారు, విద్యార్థులు

వర్ధంతి సభను జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరవీరులైన కోరన్న, మంగన్నల 58వ వర్ధంతి సభ, స్మారక స్థూపం ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న పిలుపునిచ్చారు. ఈమేరకు మొండెంఖల్లు గ్రామంలో కోరన్న-మంగన్నల స్మారక స్థూపం వద్ద సీపీఐ నాయకులు బుధవారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కె.రామకృష్ణ, జిల్లా పార్టీ ఇన్‌ఛార్జ్ గుజ్జుల ఈశ్వరయ్య తదితరులు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలి

గరుగుబిల్లి: గ్రామాలలో చిరుధాన్యాల సాగు విస్తీర్ణంను పెంచాలని ప్రకృతి వ్యవసాయ స్టేట్ రిసోర్స్ పర్సన్ పి.దేవుళ్లు అన్నారు. మండలంలోని నందివానివలస గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. గ్రామానికి చెందిన పాలన్నదొర సాగుచేసిన రాగులు పంటను పరిశీలించి పిలకల సంఖ్యను, వెన్ను పరిమాణంను గమనించారు. రాగులు, కొర్రలు, సామలు, గంటెలు, జొన్న, ఆరికలు, సజ్జ తదితర పంటల సాగు విధానం, అవలంభించాల్సిన పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. చిరుధాన్యాలను సాగుతో అధిక లాభాలను ఆర్జించేందుకు అవకాశం ఉందన్నారు. ప్రతీ రైతు తమకున్న పొలంలో కొద్ది విస్తీర్ణంలోనైనా చిరుధాన్యాలను సాగుచేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎపీఏ జి.అన్నపూర్ణ, కామేష్ తదితరులున్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

గరుగుబిల్లి: గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీపీ ఉరిటి రామారావు అన్నారు. మండలంలోని గరుగుబిల్లి, మరుపెంట, పెద్దూరు, రావివలస, తోటపల్లి, రావుపల్లి, బీవీపురం, తదితర గ్రామాల్లో ఎంపీడీఓ జి.పైడితల్లి, ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మరుపెంట గ్రామంలో ఎంపీపీ రామారావు గ్రామస్తులతో గ్రామాభివృద్ధి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించాలన్నారు. ప్రజల అవసరాలు తీరేలా దీర్ఘకాలిక పనులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థిని మృతిపై విచారణ చేపట్టాలి

కొమరాడ: కొమరాడ కేజీబీవీలో చదువుతున్న విద్యార్థిని కద్రక శారద జర్వంతో మృతి చెందిన విషయంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలని గిరిజన విద్యార్థి సంఘ అధ్యక్షుడు పల్ల సురేష్, సీపీఎం నాయకుడు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం కొమరాడలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహంలో సరైన సౌకర్యాలు లేవని, విద్యార్థులకు అందించే పౌష్టికాహారం పక్కతోవ పడుతోందని, వారి ఆరోగ్యాన్ని గాలికొదిలేశారని ఆరోపించారు. జ్వరంతో కొమరాడ పీహెచ్‌సీలో చేరిన విద్యార్థినికి వైద్యులు సకాలంలో వైద్యం అందించకపోవడంతో ఆమె ఆరోగ్యం విషమించి మృతి చెందిందని, విద్యార్థిని మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం..

- నేడు అమ్మవారి నిజరూప దర్శనం
- లక్షల్లో హాజరు కానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవదాయశాఖ



అమ్మవారి ఆలయం



కోటదుర్గమ్మవారు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం కోటదుర్గమ్మ దసరా నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవదాయ, పోలీస్ శాఖాధికారులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉంటే ఏడాదిలో ఒక్కసారి మాత్రమే కనిపించే అమ్మవారి నిజరూప దర్శనం గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 3 వరకు భక్తులకు కల్పించనున్నారు. నిజరూప దర్శనం కోసం ఉత్తరాంధ్ర నుంచి కాకుండా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు.

– లక్షల్లో భక్తులు వచ్చే అవకాశం...

గతేడాది కంటే ఈ సంవత్సరం అధిక సంఖ్యలో భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. వీఐపీ దర్శనాల వల్ల సాధారణ భక్తులు ఇబ్బంది పడకుండా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం మూడు క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

ఉత్సవాలకు రూ. 25 లక్షలు..

కోటదుర్గమ్మ ఉత్సవాల నిర్వహణకు దేవదాయ శాఖ సుమారుగా రూ. 25 లక్షల నిధులు కేటాయించింది. ఉత్సవ ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉచిత భోజనం, బందోబస్తు చర్యలు కోసం వీటిని వినియోగించనున్నారు.

నేటి నుంచి..

సీతంపేట: దోనుబాయిలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు కె. వెంకునాయుడు, రవి తెలిపారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

వీరఘట్టం: కోటదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి 12 వరకు దసరా మహోత్సవాలు జరగనున్నాయి. గురువారం ఉదయం 4 గంటలకు తొలిపూజ చేయనున్నారు. అనంతరం భవానీ, సంతోషిమాత భక్తులకు మాలాధారణ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. నవరాత్రులల్లో దుర్గాదేవిని దర్శించుకోవడం ఎంతో శుభమని శర్మయాజీ తెలిపారు.

గట్టి బందోబస్తు

ఉత్సవాల కోసం గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. డీఎస్పీ, సీఐ ఆధ్వర్యంలో ఐదుగురు ఎస్సైలు, 135 మంది పోలీసులు, 59 మంది హోమ్‌గార్డులు, మహిళా పోలీసులు విధులు నిర్వహించనున్నారు. – ఎం. రాంబాబు, డీఎస్పీ